నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
నల్గొండ యాదాద్రి సూర్యాపేట
సోమవారం 29, సెప్టెంబర్ 2025 పేజీలు - 8



# బెజవాడ రౌడీలు..



- బెజవాడను తలపిస్తున్న 'పేట'
- తాజాగా జిల్లా కేంద్రంలోని ఓ బార్‌లో మత్తులో.. బీభత్సం సృష్టించిన యువకులు
- రోడ్లపైనే వర్గాలుగా విడిపోయి తన్నుకుంటున్న యువకులు
- మారాణాయుధాలతో తెగ నరుక్కుంటున్న వైనం
- మద్యం, గంజాయి మత్తులో అడ్డొచ్చిన వారిపై విరుచుకుపడుతూ..
- పోలీసులపై సైతం దాడులకు తెగబడుతున్న యువకులు
- నిఘా పెంచి రోడ్లపై వీరంగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజల వేడుకోలు

సూర్యాపేట ప్రతినిధి, మేజర్‌న్యూస్ : సూర్యాపేట పట్టణంలో తాజాగా ఓ బార్‌లో పూటుగా మద్యం సేవించి ఐదారుమంది యువకులు బార్‌లో బీభత్సం సష్టించారు. మద్యం యజమానిపై దాడికి తెగబడ్డారు. బార్‌లో ఉన్న మద్యం సీసాలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకోగా ఏకంగా వారిపై విరుచుకుపడి దాడికి పూనుకునే ప్రయత్నం చేశారు. మునగాల మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల యువకులు తన్నుకుంటున్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకున్నారు. పోలీసులు యువకులను చెదరగొట్టే సందర్భంలో ఏకంగా ఓ ఇద్దరు యువకులు పోలీస్ కానిస్టేబుల్‌పై విరుచుకుపడ్డాడు. ఈ విషయన్ని బయటకు రానివ్వకుండా ఓ ఖద్దర్ నేత ఫోన్ కాల్‌తో యువకులను గట్టిగా మందలించి వదిలిపెట్టారు. కోదాడ పట్టణంలో వినాయక నమజ్జన శోబాయాత్రలో ఏకంగా వందల మంది చూస్తుండగా మద్యం మత్తులో ఉన్న యువకులు ఓ కానిస్టేబుల్‌పై దాడిచేసి గాయాలపాలుచేశారు. విషయం తెలుసుకున్న ఎస్పీ నరసింహ పోలీసులపై దాడులకు తెగబడితే సహించేది లేదని గట్టిగా మందలించారు. విధి నిర్వహణలో పోలీసులు ధైర్యంగా ఉండాలని గాయాలపాలైన కానిస్టేబుల్‌ను ఎస్పీ కార్యాలయానికి పిలిపించుకుని ఆర్థికసహాయం అందజేసి మనోధైర్యం కల్పించారు. జిల్లా రోజురోజుకు బెజవాడ నగరాన్ని తలపిస్తోంది. బెజవాడకు ఉన్న పేరును సూర్యాపేట జిల్లాకు తీసుకువస్తున్నారు. ఒకప్పుడు బెజవాడ నగరానికి బెజవాడ రౌడీలు అనే పేరునే ఇప్పటికీ వింటూనే ఉన్నాం.

మిగతా 2లో

# స్వర్ణగిరిలో విద్యాలక్ష్మి అమ్మవారి ఊరేగింపు



భువనగిరి ప్రతినిధి, మేజర్‌న్యూస్ : అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతః కాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు,ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువు తీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించడం జరిగింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాలతో స్వర్ణగిరి క్షేత్రం కడు రమణీయంగా వెలుగొందుతున్నది. ఉత్సవాలలో ఏడవ రోజైన ఆదివారం శ్రీ పద్మావతి అమ్మవారిని పాలు, పెరుగు వంటి విశేష ద్రవ్యాలతో అభిషేకించారు. అమ్మవారిని ధైర్యలక్ష్మిగా అలంకరించి

మిగతా 2లో

# షాడో.. పోలీస్ బాస్...!

- పనిచేసేది ఏఆర్‌లో.. - పెత్తనం చెలాయించేది సివిల్ పోలీస్ అధికారులపై
- సీనియర్లు ఉన్నా.. జూనియర్ వైపే మొగ్గు
- ఐదారేళ్లుగా చెలామణి అవుతూ.. చుక్కలు చూపిస్తున్న వైనం
- ఈ పోలీస్ బాస్ తీరుతో విసిగిపోతున్న అధికారులు
- పోలీస్ బాస్‌కు ఫిర్యాదు చేసేందుకు జంక్కుతున్న సదరు అధికారులు

సూర్యాపేటప్రతినిధి, మేజర్‌న్యూస్ : జిల్లాలో షాడో పోలీస్ బాస్ తీరుతో పోలీసు అధికారులు, సిబ్బంది వణికిపోతున్నారు. ఒరిజినల్ పోలీస్ బాస్ కంటే కూడా షాడో పోలీస్ బాస్‌దే జిల్లాలో నడుస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఈ షాడో పోలీస్ బాస్ పనిచేసేది మాత్రం సివిల్ విభాగంలో అనుకుంటే తప్పులో కాలేసినట్లే.. ఆయన పనిచేసేది మాత్రం ఆర్మ్ రిజర్వు విభాగంలో. కానీ ఆయన పెత్తనం చెలాయించేది మాత్రం జిల్లా సివిల్, ఏఆర్ పోలీసు అధికారులు, సిబ్బందిపై అనే దాంట్లో ఎలాంటి అనుమానం లేదని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఏఆర్ విభాగంలో సీనియర్ అధికారులు ఉన్నప్పటికీ గతంలో పనిచేస్తున్న ఓ ఎస్పీకి ఈయనంటే ఎక్కడ లేని మమకారం. ఆ మమకారంతో అదే పోస్టులో కొనసాగుతూ వస్తున్నారు. ఆయన తర్వాత వచ్చిన ఎస్పీలు సైతం ఈయన వైపే మొగ్గు చూపడంతో చేసేదేమి లేక ఇటీవల కాలంలో ఓ రిజర్డ్ ఇన్‌స్పెక్టర్ ఏకంగా ఆయననే స్వతహాగా బదిలీ చేయించుకుని పక్క జిల్లాకు వెళ్లినట్లు సమాచారం. ఇటు జిల్లా పోలీసు కార్యాలయంతో పాటుగా అటు పోలీస్‌స్టేషన్లలో ఏ ఇద్దరు ముగ్గురు కలిసిన ఆ షాడో పోలీస్ గురించే చర్చించుకుంటున్నారు.

***సీనియర్లు ఉన్నా.. జూనియర్ వైపే మొగ్గు.. :*** ఏఆర్ విభాగంలో పనిచేస్తున్న రిజర్వ్డ ఇన్‌స్పెక్టర్లు, డీఎస్పీలు ఉన్నప్పటికీ వారిని కాదని.. జూనియర్ అయినప్పటికీ ఆర్మ్ రిజర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌తో జిల్లా పోలీసు కార్యాలయంలో వాహనాల మెంటెనెన్స్‌తో పాటు గా ఇతర పనులను ఆ సారే చక్కదిద్దుతూ గత ఐదేళ్లకు పైగా ముందుకు సాగుతున్నారు. ఇక ఆ సారు ఓవరాక్షన్ మామూలుగా ఉండదని.. ఆయన మాట వినకుంటే జిల్లాలో పనిచేస్తున్న సీఐ,ఎస్ఐలతో పాటుగా ఆయన కింద పనిచేస్తున్న సిబ్బందిని సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోప ణలు వెల్లివెత్తుతున్నాయి. వాహనాల సర్దుబాటు, డీజిల్, పెట్రోల్ విషయంలో కూడా ఆయన మాట వింటేనే ఏదైనా లేదంటే అన్ని కట్ అన్నట్లుగా నడిపిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లా పోలీసు కార్యాల యంలో ఏర్పాటుచేసిన మార్ట్, ఆర్చి, వాలీబాల్, షటిల్‌కోర్టులతో పాటు ఇతర పనులన్ని తానే చేసినట్లుగా చెప్పుకుంటూ ముందుకు వెళ్తున్నారు.

***నేను చెప్పిందే.. శాసనం.. :*** జిల్లాలో తాను చెప్పిందే నడుస్తుందని.. నేను చేప్పిందే శాసన మవుతుందని తెగేసి చెప్పుకుంటూ పోలీసు అధికారులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. గత ఐదారేళ్లుగా ఏఆర్ విభాగంలో ఎంటీవోగా చెలామణి అవుతూ ఇటు పోలీసు అధికారులకు.. అటు ఆయన కింద పనిచేస్తున్న సిబ్బందికి సైతం చుక్కలు చూపిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే జిల్లా పోలీసు బాసుకు ఫిర్యాదులు కూడా చేసినట్లు కొందరు పోలీసులు బాహాటంగా చర్చించుకుంటున్నారు. అయినప్పటికీ ఆయనపై చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

# ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కోదాడ, మేజర్‌న్యూస్ : పట్టణంలోని ఎంఎస్ జూనియర్ కళాశాలలో 1998-2000 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ సిఇసి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం స్థానిక కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు .చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాటి అధ్యాపకులను ఘనంగా సన్మానించుకుని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పందిరి నాగిరెడ్డి, విద్యార్థులు కొట్టే సైదులు, ఇర్ల భూపతి రెడ్డి, ప్రదీప్, వీరభద్రం, శ్రీహరి, కళ్యాణ్ చక్రవర్తి, సురేందర్ రెడ్డి, వాసవి తదితరులు ఉన్నారు.

**హుజూర్‌నగర్ రూరల్ :** నాటి వివేకవర్ధిని జూనియర్ కళాశాల 2000-2002



మొదటి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక లక్ష్మీనరసింహా గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా పూర్వ విద్యార్థులు ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పించిన అధ్యాపకులను శాలువాతో సన్మానించారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకుని తమ యోగక్షేమాలను అడిగి తెలుసుకుని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు మంచికంటి సత్యనారాయణ, బెల్లంకొండ ప్రసాద్, ఆదిమూలం శ్రీనివాస్, రమణారెడ్డి, నాగుల్‌మీరా, ఖాసీం, పూర్వ విద్యార్థులు సురేష్, చంద్రశేఖర్, శ్రీనివాస్, హసన్, సతీష్, సాయి, కాశీ, కల్పనా, వసంత, లత, రాధిక, కవిత పాల్గొన్నారు.

# బెజవాడ రౌడీలు..

(మొదటిపేజీ తరువాయి)

అలాంటి సీన్‌ను సూర్యాపేట జిల్లాకు తీసుకువచ్చి పేటకు ఉన్న పేరును మసకబారే ప్రయత్నాన్ని పేట జిల్లా యువకులు మద్యం మత్తులో చేస్తున్న వీరంగంతో వార్తల్లోకెక్కిస్తున్నారు. ముఖ్యంగా సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల పట్టణాల్లోని ప్రధాన వీధుల్లో మద్యం, గంజాయి మత్తులో ఉన్న యువకులు గ్రూపులుగా విడిపోయి తన్నుకుంటున్నారు. పూటుగా మద్యం సేవించి కొందరు.. ఇంకా కొందరు యువకులైతే ఏకంగా గంజాయి మత్తులో రోడ్లపైనే గుంపులుగా ఏర్పడి దాడులు చేసుకుంటున్నారు. రోడ్లపై యువకులు చేస్తున్న వీరంగంతో భార్యా పిల్లలతో కలిసి బయటకు వచ్చేందుకు ప్రజలు జంక్కుతున్నారు. కనీసం పక్క నుంచి వందల సంఖ్యలో ప్రజలు తిరుగుతున్నా కూడా వారిని పట్టించుకునేపాపానా పోవడంలేదు. కేవలం వారి మత్తులో వారు కొట్టుకోవడం.. తన్నుకోవడం అవసరమైతే మారాణాయుధాలతో నరుక్కోవడం చేస్తున్నారు.

**జంక్కుతున్న పేట..**

రోజురోజుకు మద్యం, గంజాయి మత్తులో యువకులు చేస్తున్న వీరంగంతో జిల్లా ప్రజలు ఒక్కసారిగా జంక్కుతున్నారు. రోజు ఏదో ఓ చోట యువకులు చేస్తున్న అరాచకంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్నిచోట్ల అడ్డుతగిలిన వారిపై కూడా దాడులు చేస్తూ గాయాలపాలుచేస్తున్నారు. ప్రజలనే కాకుండా కొన్నిచోట్ల ఏకంగా పోలీసులపైనే దాడులు చేస్తున్నారు.

**నిఘా పెంచి.. చర్యలు తీసుకోవాలని వేడుకోలు..**

జిల్లా కేంద్రంతో పాటు హుజూర్‌నగర్, కోదాడ, తిరుమలగిరి, నేరేడుచర్ల పట్టణాలతో పాటు ప్రధాన మండల కేంద్రాల్లో సైతం పోలీసుల పెట్రోలింగ్ పెంచి నిఘా ఉంచాలని ప్రజలు వేడుకుంటున్నారు. మద్యం, గంజాయి మత్తులో ఉన్న యువకులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పోలీసు నిఘా కూడా సరిగా లేకపోవడంతో మత్తులో యువకులు రెచ్చిపోతున్నారని ఆరోపిస్తున్నారు. మత్తు వదలాలంటే లాఠీ ఝులిపించాలని ప్రజలు ముక్తకంఠంతో ప్రాధేయపడుతున్నారు.

**సహించేదే లేదు : నరసింహ, ఎస్పీ**

మద్యం, గంజాయి మత్తులో యువకులు రోడ్లపై వీరంగం సష్టిస్తే సహించేది లేదు. ఇటీవలి కాలంలో యువకుల తీరు కొంత ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నట్లుగా మా దష్టికి వచ్చింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పోలీసు నిఘా పెంచాం. ప్రజలకు, పోలీసులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించిన ఊరుకునేది లేదు. పోలీసులు ధైర్యంగా విధులు నిర్వర్తించాలి. ప్రజలకు అసౌకర్యం, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదుచేస్తాం. ఒకటిరెండు సార్లు చూసి పీడీ యాక్టులు కూడా నమోదుచేస్తాం.

# విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



గుర్రంపోడ్, మేజర్‌న్యూస్ : గుర్రంపోడ్ మండలం కొప్పోలు గ్రామానికి చెందిన బొంగరాల సతీష్ (25) సంవత్సరాలు కొప్పోలు శివారు బోడపాడు సమీపంలో గల తన వ్యవసాయ భూమి పొలముకు నీరును కట్టడానికి వెళ్లిన సతీష్ సాటర్ పెట్టెలో కరెంటు రాకపోవడంతో ఫ్యూజును మార్చి వేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురి అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# స్వర్ణగిరిలో విద్యాలక్ష్మి అమ్మవారి ఊరేగింపు

(మొదటిపేజీ తరువాయి)

ఆలయంలోని లక్ష్మి మండపంలో కొలువుదీర్చి సకల అనంతరం అమ్మవారికి బిల్వదళాలతో అర్చన చేశారు. విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. మనోబల ప్రాప్తికై ధైర్య లక్ష్మి హవనం నిర్వహించారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. విద్యాలక్ష్మి అమ్మవారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.తిరువీధి ఉత్సవ సేవ అనంతరం ధైర్యలక్ష్మి అమ్మవారిని దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు. దసర శరన్నవరాత్రోస్థవాల్లో ఏడవ రోజైన ధైర్యలక్ష్మి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు విశేషంగా నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు.

# ఘనంగా బతుకమ్మ వేడుకలు

హుజూర్‌నగర్‌రూరల్, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని వేపలసింగారం గ్రామంలోని మిట్టగూడెం ప్రాథమిక పాఠశాలలో మాజీ సర్పంచ్ అన్నెం శిరీషకొండారెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మైహోం సిమెంట్ పరిశ్రమ ప్లాంట్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మహిళలతో కలసి ఆడిపాడారు.అన్నెం శిరీషాకొండారెడ్డి శ్రీనివాసరావు దంపతులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సారెడ్డి భాస్కర్‌రెడ్డి, నందిరెడ్డి సైదిరెడ్డి, సాముల హరిలీలబ్రహ్మరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

# బాధితురాలి కుటుంబానికి ఆర్థిక చేయూతనందించిన మాజీ జడ్‌పిటిసి

పాలకవీడు, మేజర్‌న్యూస్ : మండలంలోని బె ట్టితండా గ్రామానికి చెందిన ధీరావత్ శిరీష అనారోగ్యానికి గురై నేరేడుచర్లలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో మాజీ జడ్‌పిటిసి మాలోతు మోతీలాల్‌నాయక్ ఆదివారం బాధితురాలికి రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని అందచేసి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి సిఎం సహాయనిధి నుండి కూడా పరిహారం అందించేలా కృషి చేస్తానన్నారు. ఆర్థిక సహకారం అందించిన మాజీ జడ్‌పిటిసి మోతీలాల్‌నాయక్‌కు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బండావత్ నాగేష్‌నాయక్, బండావత్ శ్రీను, మాలోతు శ్రీను, బండావత్ కిషన్, మాలోతు నాగేశ్వరరావు, మాలోతు నగు, ధీరావత్ మంగ్య, బండావత్ నాని, డాక్టర్ సందీప్, మాలోతు సందీప్‌నాయక్, మాలోతు ప్రసాద్‌నాయక్, ధీరావత్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ నూతన డైరక్టర్‌ను కలిసిన సతీష్ మ్యూజిక్ అకాడమి బృందం



గరిడేపల్లి, మేజర్‌న్యూస్ : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ నూతన డైరక్టర్ ఏనుగు నర్సింహారెడ్డిని ఆదివారం మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన సతీష్ మ్యూజిక్ అకాడమి బృందం అధ్యక్షులు అమర వరపు సతీష్,బృంద సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ నిరుపేద కళాకారులకు అండగా నిలవాలని, కళాకారులకు గుర్తింపుకార్డులు ఇచ్చిన వయస్సు పైబడిన వారికి ఫించన్ ఇవ్వాలని నర్సింహారెడ్డిన కోరారు. ఇందిరమ్మ ఇండ్లలో కళాకారులకు అవకాశం కల్పించాలని, కళాకారులకు మ్యూజిక్ పరికరాలతో పాటు డ్రెస్‌కోడ్ అందచేయాలన్నారు. కళాకారులకు భృతి కింద నెలకు రూ.10వేల వేతనం ఇవ్వాలన్నారు.కార్యక్రమంలో కల్పనా, నాగమణి, స్వరూప, చంద్రకళ, రాణి, అనురాధ, నాగమణి,వీరబాబు, శోభన్,సంధ్య,భువనేశ్వరీ, సునీత, మరియమ్మ,శారద పాల్గొన్నారు.

# ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ధి ఉత్సవాలు



హుజూర్‌నగర్‌రూరల్,మేజర్‌న్యూస్: స్థానిక రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ( ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో మల్లన్ననగర్ సీతారాం బస్తీకాలనీలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పడి వందసంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఆదివారం శతాబ్ధి ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా వారణాసి కిషోర్ పాల్గొని మాట్లాడారు.దేశసేవలో ఆర్‌ఎస్‌ఎస్ ఎప్పుడు ముందంజలో ఉంటుందన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా ఆర్ ఎస్‌ఎస్‌లో చేరి దేశ సేవలో నిమగ్నం కావాలన్నారు.ఆర్‌ఎస్‌ఎస్‌లో భాగంలో ఉండే పంచ పరివర్తన్‌లో ఉండే ఐదు విషయాలను వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్‌లో వ్యక్తికి కాకుండా కాషాయా ధ్వజానికి పూజ చేయడం జరుగుతుందని ఇది ఒక ఆర్ ఎస్‌ఎస్‌లో సాధ్యమన్నారు.కార్యక్రమంలో నగర కార్యవాహ సముద్రాల సంతోష్‌కుమార్, సహ కార్యవాహ రాపోలు నాగప్రవీణ్, నగర శారీరక ప్రముఖ్ చిన్నపల్లి నరసింహ, ఇందిరాల రాంబాబు, గొట్టె కిరణ్,జక్కుల శ్రీకాంత్, చెక్క అంజి పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజాస్వామిక కార్మిక సంఘం పోస్టర్ ఆవిష్కరణ



తిరుమలగిరి మేజర్ న్యూస్ : సూర్యాపేట జిల్లా తిరుమలగిరి చౌరస్తాలో తెలంగాణ ప్రజాస్వామిక కార్మిక సంఘం ఆవిర్భావ సభ పోస్టర్‌ను సూర్యాపేట జిల్లా కన్వీనర్ వడగండ్ల సాయి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సుద్దాల నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడుసార్లు అధికారంలోకి వచ్చిన తర్వాత .ప్రధాని నరేంద్ర మోడీ మరియు అమిత్‌షాలు కలిసి ఆర్‌ఎప్‌ఎస్ ఏజెండాను కార్పోరేట్ శక్తులకు భారతదేశంలో ప్రభుత్వ పరిశ్రమలను నిర్వీర్యం చేసే అదాని అంబానీలకు సంపదను దోచిపెట్టే మార్గం సులభతరం చేశారన్నారు. ప్రభుత్వ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులు ఎల్‌ఐసి ఎన్టిపిసి రైల్వే విమానం పోర్టులో ఆహ్వానించారని అన్నారు. ఇది గాక బ్యాంకుల్లో లక్షల కోట్ల రూపాయలు దోచుకుతిన్న ఆదాని అంబానీలకు రుణాలు మాఫీ చేశారన్నారు. ఎప్పటికైనా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులైజేషన్ చేయాలన్నారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. కనీసం వేతన చట్టం అమలు చేయాలి అని కార్మికుల పక్షాన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రధానమైన డిమాండ్లతో వచ్చే నెల అక్టోబర్ 12వ తేదిన జరగబోయే ఆవిర్భావ సభ విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజాస్వామిక కార్మిక సంఘం నాయకులు పాలేపు నాగేందర్, సంపంగి సారయ్య, చేరాల వెంకటేశ్వర్లు, ముత్తమ్మ, సతీష్, కార్మిక సోదరులు పాల్గొన్నారు.

# జిల్లా ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఎన్నిక



భువనగిరి ప్రతినిధి, మేజర్‌న్యూస్ : పట్టణ కేంద్రంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కమిటీని ఆదివారం రాష్ట్ర అధ్యక్షులు పొత్తూరి నరసింహారావు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ కమిటీ నియమించడానికి ఎన్నికల అధికారిక డాక్టర్ టి.జ్ఞానేశ్వర్ సహాయ ఎన్నికల అధికారిగా ఎన్.వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా సీనియర్ సిటిజన్స్ నూతన అధ్యక్షులుగా యెర్రగుంటే వెంకటేశం ఉపాధ్యక్షులుగా కరిపె నర్సింగ రావు, కే.సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దర్గాయి నర్సింగారావు, సమ్యుక్త కార్యదర్శిలుగా బండారు బిక్షపతి రెడ్డి, యెర్రగుంట విఠల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పాశం రాములు, గౌరవ సలహాదారుగా పూర్ణచందర్ రాజు, కార్యనిర్వాహక సభ్యులుగా దొంత సుమిత్ర, శ్రీరాం, సత్తయ్య, గుంటి యాదగిరి, ఆర్.రామచంద్ర రెడ్డి, ఎం.విష్ణుమూర్తి, ఎండి గౌస్, వి.బ్రహ్మచారి, జెట్ట యాదగిరి, రాపోలు సత్తయ్య, కే.రాము ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అనంతరం మా ఎన్నికలకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులకు నూతన కమిటీ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ వికలాంగులు ట్రాన్స్ జెండర్స్ శాఖ నుండి వయోవృద్ధుల శాఖను వేరుచేసి ఒక నూతన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని వేధింపుల కేసులకు వయోవృద్ధుల మీద గ్రామాలలోని మీసేవ సెంటర్ల ద్వారా దర ఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. అదేవిధంగా నూతన కమిటీ ప్రమాణస్వీకారం చేసి మాపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చుతామని అన్నారు. జిల్లాలో ఉన్న వయోవృద్ధుల సమస్యలను తీర్చుటకు కృషి చేస్తామని తెలిపారు.

# ఎల్డర్స్ రిక్రియేషన్ క్లబ్ సొసైటీ పాలకవర్గ సమావేశం



కోదాడ, మేజర్‌న్యూస్ : కోదాడ పట్టణంలో రామ్ మూర్తినగర్‌లో ఉన్న ఎల్డర్స్ రిక్రియేషన్ క్లబ్ సొసైటీ కార్యవర్గ సమావేశం అధ్యక్షులు ఏటుకూరి రామారావు అధ్యక్షతన ఆదివారం ఆడిటోరియం ఆవరణలో జరిగింది. ఈ సమావేశంలో 2024-25 కాలానికిగాను ఆడిటోరియం, కళ్యాణ మండపంకు సంబంధించిన జమా ఖర్చుల వివరాలును పరిశీలించి, షటిల్ కోర్టులో నూతన లైటింగ్ విధానం ఏర్పాటు చేయుటకు గాను సభ్యులందరి ఏకాభిప్రాయంతో ఆమోదించడం జరిగింది అని డాక్టర్ రామారావు తెలిపారు. ఇటీవల మృతి చెందిన క్లబ్ కోర్ కమిటీ సభ్యులు శాఖమూడి నరసింహారావు సభ్యత్వాన్ని వారి కుమారుడు విజయ్‌కు కమిటీ సభ్యత్వం ఇచ్చేందుకు తీర్మానించడం జరిగింది అని,19-10-2025 ఆదివారం నాడు ఎల్డర్స్ రిక్రియేషన్ క్లబ్ జనరల్ బాడీ, కోర్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయుటకు తీర్మానం చేయడం జరిగింది అని తెలిపారు. అదేవిధంగా క్లబ్ ఆధ్వర్యంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలకు సొసైటీ తరపున సమావేశానికి ఆహ్వానించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి చక్కర చిన్నపరెడ్డి, డాక్టర్ జాస్తి సుబ్బారావు, క్లబ్ ఉపాధ్యక్షులు రామారావు, రామినేని శ్రీనివాసరావు, పెదనాటి వెంకటేశ్వరరావు, తూమాటి సురేష్ రెడ్డి, ఇమ్మడి రమేష్, కోశాధికారి తోట రంగారావు, మహమ్మద్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్రం రాకముందే పుట్టిన సంఘం ఎస్‌టియు




కోదాడ, మేజర్‌న్యూస్ : మన దేశంలో స్వాతంత్ర వాయువులు పీల్చకముందే ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘం ఏర్పడిందని, అలాంటి సంఘంలో పని చేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చి దిద్దడమే కాకుండా, నవ సమాజ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించాలని ఎస్‌టియు రాష్ట్ర మాజీ అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి రాములు అన్నారు. ఆదివారం కోదాడ ఉత్తం పద్మావతినగర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో జరిగిన ఎస్‌టియు సూర్యాపేట జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్య పూర్వమే నైజాం కాలంలోనే ముక్దుం మోహినుద్దీన్ గృహములో పురుడు పోసుకున్న వీరోచత సంఘం ఎస్‌టియు అన్నారు. నైజాం పోరాటంలో పాల్గొన్న ఏకైక ఉపాధ్యాయ సంఘం, అన్ని ఉపాధ్యాయ సంఘాలకు మాతృ సంఘం అని ఉద్భోదించారు. బీపీ రాఘవాచారి, శ్యాంసుందర్రావు, కాళోజీ నారాయణ రావు, తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ లాంటి ఎందరో మహానుభావులు ఉద్భవించిన సంఘం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఓరుగంటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బంధం వెంకటేశ్వర్లు, కోశాధికారి బి. రూప్ల నాయక్, నల్లగొండ జిల్లా అధ్యక్షులు వీర రాఘవులు, కె.వి, ఆర్.శ్రీనివాస్, చందూలాల్, అంజన్ రెడ్డి, సురగాని లింగయ్య, పుట్టపాక నరసింహారావు, గుండు ఆదినారాయణ, అత్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేడే సద్దుల బతుకమ్మ



చింతపల్లి, మేజర్‌న్యూస్ : బతుకమ్మ వేడుకలు నేడు సోమవారం సాయంత్రం గోడకొండ్ల, మాల్ వెంకటేశ్వర్‌నగర్‌లోనీ స్థానిక రామలింగేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఊరే లక్ష్మణ్, కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం మహిళలందరూ బతుకమ్మలు తీసుకొని రామలింగేశ్వర స్వామి దేవాలయంలోకి రావాలని వారు కోరారు. దేవాలయం ప్రాంగణమంతా శుభ్రంగా తయారు చేయించారు. బతుకమ్మ ఆడటానికి వీలుగా మ్యాట్లు వేయించారు. గ్రామ పెద్దలు మహిళలు అందరు రావాలని వారు కోరారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ప్రతిరోజు దుర్గామాత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు ప్రతిరోజు ఉదయం మధ్యాహ్నం సాయంత్రం ఘనంగా పూజల నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మణ్ తెలిపారు.

# సినీ హాస్యనటుడు వేణుమాధవ్ జయంతి



కోదాడ, మేజర్‌న్యూస్ : కోదాడలోని "తెర" సాంస్కృతిక కళామండలి ఆధ్వర్యంలో సినీ హాస్య నటులు, నంది అవార్డు గ్రహీత వేణుమాధవ్ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పారా సీతయ్య తెర అధ్యక్షుడు వేముల వెంకటేశ్వర్లు తోపాటు సభ్యులు వేణుమాధవ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూతన చేష్టల ద్వారా, హావభావాల చేత హాస్యాన్ని పలికిస్తూ విద్యార్థి దశ నుండే అనేక ప్రదర్శనలు ఇచ్చి అందరినీ రంజింపజేశారు. రంగస్థలంపై, అలాగే సినీ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. తన మిమిక్రీ కళ చేత రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వేల ప్రదర్శనలు ఇచ్చి మెప్పించారు అని అన్నారు. భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికీ నటన ద్వారా సజీవంగా ఎప్పటికీ ఉంటారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ మీరా, షేక్ పీర్ సాహెబ్, పాలూరి సత్యనారాయణ, కంచుకొమ్ముల శంకర్, గార్లపాటి వీరారెడ్డి, గుండెల సూర్యనారాయణ యాదవ్, షేక్ యాకూబ్, ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, బుడిగం నరేష్, పెద్దినేని రామారావు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల జీవో విడుదల చేయడం పట్ల హర్షం

## బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్

మోత్కూర్, మేజర్‌న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై జిఓ 9 విడుదల చేయడం పట్ల బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గత 5 దశాబ్దాలు బీసీ రిజర్వే షన్లపై దేశంలో అనేక ఆందోళన జరుగుతున్న ప్పటికీ గత ప్రభుత్వాలు బీసీలను అన్ని రకాలుగా ఉపయోగించుకొని రాజకీయంగా వాడుకున్నాయని ఆరోపించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ రాజ్యాంగ, న్యాయబద్ధమైనవని రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు సంపూర్ణ మద్దతు తెలిపాలని కోరారు. బీసీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు అగ్రకులాలు కుట్రలు చేస్తే బీసీల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నోముల రమేష్ నేత, పట్టణ అధ్యక్షులు నిలిగొండ మత్స్యగిరి, మండల నాయకులు మర్రి కమల్ నాథ్, వర్రే శ్రీనివాస్, జి.సతీష్, సిహెచ్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



సూర్య
www.suryaa.com



# దుర్గాదేవి అవతారంలో అమ్మవారు



నేరేడుచర్ల, మేజర్‌న్యూస్ : మున్సిపాలిటి పరిధిలోని శివాజీనగర్‌లో భవానీ యూత్ దేవిశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సామూహిక కుంకుమార్చన పూజ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కాగా కనకదుర్గమ్మ అమ్మవారిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొణతం చినవెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షులు నూకల పందీప్ రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

***హుజూర్‌నగర్ టౌన్ :*** మున్సిపాలిటి పరిధిలోని 18వ వార్డులో ఏర్పాటు చేసిన



దేవిశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.కాగా అన్నదాన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.డి అజీజ్‌పాషా, జక్కుల మల్లయ్య, సమ్మెట సుబ్బరాజు, చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి, నరసింహాచారి, కోల మట్టయ్య, చారి, చంద్రశేఖర్,హైమేష్ పాల్గొన్నారు.

***భువనగిరి ప్రతినిధి :*** పట్టణ కేంద్రంలోని పదో వార్డ్ హౌసింగ్ బోర్డ్ భక్త భజన మండలి ఆధ్వర్యం లో శ్రీ దుర్గామాత శరన్న వరాత్రోత్సవాలు ఆరవ రోజు సందర్భంగా పట్టణ కేంద్రానికి చెందిన ఇలి యాస్ మహమ్మద్ ఆధ్వ ర్యంలో అన్న ప్రసాద విత రణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా మాజీ 10వ వార్డ్ కౌన్సి లర్ మున్సిపల్ ఫోర్ లీడర్ పోత్నాక్ ప్రమోద్ కుమార్ మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ 26వ వార్డు కౌన్సిలర్ ఈరపాక నరసింహ 23వ వార్డు కౌన్సిలర్ పడగెల రేణుక ప్రదీప్ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఇమ్రాన్ పాల్గొని అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 14 సంవత్సరాల నుండి హౌసింగ్ బోర్డ్ కాలనీలో కుల మతాల కు దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అంతేకాకుండా భారత దేశంలో లౌకికతత్వానికి భిన్నత్వంలో ఏకత్వంలో సాంప్రదాయ పరిస్థితులను అనుసరించి బోనీలో కూడా దుర్గామాత వద్ద కులాలకు మతాలకు అతీతంగా మైనార్టీ సోదరులు అన్న ప్రసాద జాతక నిల్చడమే చారిత్రాత్మక విషయమని ప్రజలందరూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు శీలం క్రాంతి రెడ్డి, బింగి నరేష్, చిన్న సందీప్, రాజు మల్ల భరత్, వంశీ, శ్రీకాంత్, శివ, తిలక్, సాయి, అఖిల్, బిట్టు, మాటూరి బాలేశ్వర్, అమానత్ ఇమ్రాన్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.





***కోదాడ :*** పట్టణంలో పలుచోట్ల ఏర్పాటుచేసిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కమిటీ





సభ్యులు ఘనంగా నిర్వహిస్తు న్నారు. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు ఆది వారం అమ్మవారు భక్తులకు శ్రీ మంగళ గౌరీ దేవి రూపంలో దర్శనం ఇచ్చారు. వేద పండి తులు ప్రత్యేక పూజ కార్యక్ర మాలు నిర్వహించారు. మహి ళ భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిం చారు. శరన్నవరా త్రుల ఉత్సవాలు సందర్భంగా దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదానాలు నిర్వహించారు. గోపిరెడ్డి నగర్‌లో జరిగిన అన్నదానాన్ని మాజీ సర్పంచ్ వెంకటరత్నం బాబు ప్రారంభించారు.

***చింతపల్లి :*** మాల్ వెంకటేశ్వర్ నగర్‌లోని శ్రీ గాయత్రి పీఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత గత ఏడు రోజులుగా వైభవంగా, కన్నుల పండుగగా అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ప్రత్యేకంగా దుర్గామాతను అలంకరణ చేసి హోమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం శుద్ధ సప్తమి జేష్ట నక్షత్రం సందర్భంగా దుర్గాదేవిగా అలంకరించారు. భక్తులకు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఈ పూజా కార్యక్రమంలో వేద బ్రాహ్మణులు శ్రీ గాయత్రి పీఠం వ్యవస్థాపకులు క్రోవ్విడి. సత్య సాయి బాబా శాస్త్రి వారి కుటుంబ సభ్యులు, మహిళలు, గ్రామ ప్రజలు కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

***హాలియా :*** హాలియాలోని దుర్గామాత మండపం వద్ద ఆదివారం అన్నదాతగా కుక్కడాల చంద్రమౌళి జ్ఞాపకార్థం, ఆయన కుమారుడు కుక్కడాల సాయి ప్రకాష్ ముందుకు వచ్చి ఘనంగా కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సాయి ప్రకాష్ మాట్లాడుతూ "దేవి దుర్గామాత అనుగ్రహంతోనే అన్నీ సాఫల్యమవుతాయి. సమాజంలో ప్రతి ఒక్కరూ సద్వ్యవహారాలతో ముందుకు సాగాలన్నది అమ్మవారి ఆశీస్సు. ఇలాంటి మహోత్సవాల్లో పాల్గొని సేవ చేయడం పుణ్యఫలాన్నిస్తుంది" అని అన్నారు. అలాగే అమ్మవారిని శ్రద్ధగా ఆరాధించిన ప్రతి ఒక్కరికీ ఆత్మ శాంతి, కుటుంబ సౌఖ్యం కలుగుతాయి. దసరా పర్వదినాలు ధర్మబద్ధమైన జీవనానికి మార్గదర్శనం చేస్తాయి. అమ్మవారి సేవలో భాగంకావడం ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక తృప్తి ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.ఎస్ యూత్ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసాదాన్ని స్వీకరించారు.





### మంత్రి పొన్నం ప్రభాకర్

# ఆర్టీసీ బస్టాండ్ ఆకస్మికంగా తనిఖీ





మిర్యాలగూడ టౌన్, మేజర్‌న్యూస్ : మిర్యాలగూడలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ పర్యటన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే కోరడంతో మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్ మరమ్మత్తు పనులు చేయాలని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అదేశించారు. బస్టాండ్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌కు మూసీపై ఎలాంటి అవగాహన లేదు. ప్రభుత్వపరంగా అన్ని జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే మూసి గేట్లు ఎత్తడం జరిగింది. బీఆర్ఎస్, బీజేపీలు బురద రాజకీయాలు మానుకోవాలి. అందర్నీ అప్రమత్తం చేసి 12 పునరావస కేంద్రాలు ఏర్పాటు చేశాం. బాధితులను పునరావస కేంద్రాలకు క్షేమంగా తరలించాం. ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు ప్రజలు. ప్రతిపక్షాలు అన్నీ ప్రభుత్వానికి సహకరించాలి.ప్రతిపక్షాలు ప్రజల్ని తప్పుదారి పట్టించొద్దంటూ సూచన.

***క్యాబినెట్ ఆమోదంతోటే 42 శాతం బీసీ రిజర్వేషన్లు***

బీసీ రిజర్వేషన్లతో ఎస్సీ ఎస్టీలకు ఎలాంటి ఇబ్బంది లేదు. రిజర్వేషన్లపై అపోహలు.. తప్పుడు ప్రచారమే..రిజర్వేషన్‌ల ప్రక్రియలో ఎవరి ప్రమేయం లేదు. రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందని భావిస్తున్నాను. కోర్టు తీర్పుని ఎవరైనా సరే గౌరవించాల్సిందే. రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా రిజర్వేషన్లు అమలు చేశాం. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు మరింత సేవ చేసేందుకు కృషి చేస్తా

### సిపిఐ సీనియర్ నాయకులు కొల్లూరు రాజయ్య



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : ప్రజలు తనకు ప్రజాప్రతినిధిగా అవకాశం కల్పిస్తే మరింత విస్తృతంగా ప్రజలకు సేవ చేస్తారని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సీనియర్ నాయకులు కొల్లూరి రాజయ్య అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు జడ్పిటిసి గా పోటీ చేయాలనే ఆలోచన ఉందని ఎందుకు పార్టీ ప్రజలు సహకరిస్తే వారికి పూర్తిస్థాయిలో స్వచ్ఛందంగా సేవ చేస్తానని, యాదగిరిగుట్ట మండల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. తాను రైతుగా సీనియర్ నాయకుడుగా గత కొన్ని సంవత్సరాలుగా సిపిఐ పార్టీలో కొనసాగుతూ ప్రజలకు ఎంతగానో అందుబాటులో ఉంటూ విశేషమైన సేవలు అందిస్తున్నారని అన్నారు. పార్టీ తన సేవలను గుర్తించి అవకాశం కల్పిస్తే ప్రజాప్రతినిధిగా పోటీ చేసేందుకు తను సిద్ధమేనని అన్నారు. తాను జీవితకాలం పూర్తిగా ప్రజాసేవలో నిమగ్నమై కొనసాగుతారని అన్నారు. ప్రజల కోసం రెండు ఇబ్బందులు వచ్చిన వారి బాహు కోసం కృషి చేస్తానని అన్నారు.

# అనంతలక్ష్మి ఉద్యోగ విరమణ సన్మానం



పెన్‌పహాడ్, మేజర్‌న్యూస్ : మండల కేంద్రంలో ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ తోట అనంతలక్ష్మి ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం కార్యక్రమము మండల వైద్యాధికారి రాజేష్ నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం సత్య గార్డెన్స్‌లో ఘనంగా తోట అనంతలక్ష్మి భర్త అనిల్ కుమార్ ఘనంగా సూర్యాపేట జిల్లాలోని వివిధ ప్రభుత్వ దావకానాలలో పనిచేస్తున్న ఉద్యోగులు అంగరంగ వైభోగంగా సన్మానించినారు. జరిగినది. ఈ సందర్భంగా తోట అనంతలక్ష్మి మాట్లాడుతూ నేను వివిధ వైద్యశాలలో విధులు నిర్వహించినప్పుడు చాలా బాధ్యతగా విధులు నిర్వహించి తాను చేస్తున్న విధులలో మంచి సేవలు అందించి మొదటగా2004లో ఉమ్మడి నల్లగొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కుందూరి జానారెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు గ్రహీత అవార్డు సాధించానని, ప్రస్తుతం సిహెచ్‌ఓగా ప్రమోషన్‌లో భాగంగా పెన్ పహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాధ్యతలు నిర్వహిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి సూర్యాపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఉత్తమ అవార్డు గ్రహీత రెండవసారి అవార్డు అందుకోవటం జరిగిందని నా సర్వీసులో ఈ రెండు అవార్డులు మరువలేనివని ఆమె అన్నారు. పెన్ పహాడ్ పిహెచ్సిలు డాక్టర్ రాజేష్ నాయొక్క విధి నిర్వహణలో చాలా సపోర్టుగా ఉండేవారని అదేవిధంగా ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలలో నేను మమేకమై ఉండటమే కాకుండా వారి యొక్క విధి నిర్వహణలో మంచి సూచనలు అందించేదని వారు కూడా తూచా తప్పకుండా పాటించి విధి నిర్వహణలో మంచి ప్రోగ్రెస్ ఇచ్చేవారు మా ఆస్పత్రి బృందం కూడా అలాగే నన్ను ఆప్యాయత అనురాగాలలో గౌరవించే వారిని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి పి.చంద్రశేఖర్, వివిధ గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లు, పెన్‌పహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు పాల్గొన్నారు.

# అమ్మవారు భువనేశ్వరి దేవిగా భక్తులకు దర్శనం



యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవీ నవరాత్రోత్సవాల సందర్భంగా ఏడవ రోజు అమ్మవారు శ్రీ భువనేశ్వరి దేవీగా భక్తులకు దర్శనం, ఆదివారం ఉదయం ప్రాతఃకాల పూజ అర్చనలు పారాయణాలు శ్రీదేవీ మూల మంత్ర జపం మధ్యాహ్నం శ్రీదేవీ చతుషష్టి ఉపచార పూజ నీరాజన మంత్ర పుష్పములు తీర్థప్రసాద వినియోగం జరిగినాయి. సాయంకాలం నుండి నవావరణ పూజ, చతుషష్టి, ఉపచార పూజ, సహస్రనామార్చనలు, మంత్రపుష్పములు తీర్థప్రసాద వినియోగం జరిగినాయి. ఇట్టి కార్యక్రమంలో అర్చకులు పురోహితులు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# చెరుపల్లి లక్ష్మమ్మకు ఘన నివాళులు అర్పించిన శాసనమండలి చైర్మన్





చిట్యాల, మేజర్‌న్యూస్ : సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యులు, శాసన మండలి మాజీ సభ్యులు చెరుపల్లి సీతారాములు తల్లి లక్ష్మమ్మ కుటుంబ పెద్దగా ఉంటూ తమ పిల్లలను క్రమశిక్షణతో పెంచారని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీర భద్రం మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి అన్నారు. చిట్యాలలో ఆదివారం జరిగిన చెరుపల్లి లక్ష్మమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. లక్ష్మమ్మ కు ఐదుగురు కుమారులు, ఐదుగురు కోడళ్ళు, మనుమలు, మనుమరాళ్ళతో కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించిన ఆమె చనిపోయి యేడాది ఐనా, కుటుంబ సభ్యుల మదిలో చెదరని ముద్రలా ఉన్నారని కొనియాడారు. ముందుగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ జాతీయ నాయకులు పల్లా వెంకట్ రెడ్డి, ఎంఎల్‌సి నెలికంటి సత్యం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, యం.డి.జహాంగీర్, మల్లు లక్ష్మి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ యంయల్ సి అలుగుబెల్లి నర్సిరెడ్డి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి,నారీ ఐలయ్య,కొండమడుగు నర్సింహా, ఆశయ్య, కందాల ప్రమీల, మల్లు నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వట్టె జానయ్య జన్మదిన వేడుకలు



పెన్‌పహాడ్, మేజర్‌న్యూస్ : పెన్‌పహాడ్ మండల కేంద్రంలో ఆవుల అంజయ్య ఆధ్వర్యంలో ఉత్త జానయ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాజ్యాధికార పార్టీతో ప్రజలకు న్యాయం జరుగుతుందని సూర్యాపేట జిల్లా నాయకులు ఆవుల అంజయ్య అన్నారు. ఆదివారం పెన్ పహాడ్ మండల కేంద్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ వట్టే జానయ్య జన్మదిన వేడుకలు ఘనంగా భారీ కేక్ కట్ చేసి, వృద్ధులకు పలు రకాల పండ్లు పంపిణీ చేసినారు. ఈ సందర్భంగా సూర్యాపేట తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు ఆవుల అంజయ్య మాట్లాడుతూ పేదల కోసం ప్రతి క్షణం పనిచేస్తున్న ఎంతోమంది పేదలకు సహాయ సహకారాలు అందిస్తున్న ఒట్టే జానయ్య యాదవ్ ఆయురారోగ్యాలతో ఉండి నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండాలని, మరి ఎంతోమంది పేదలకు ఇంకా సహాయ సహకారాలు అందించాలని, ఎస్సీ ఎస్టీ మైనార్టీ బీసీ లకు న్యాయం జరగడం కోసమే తీర్మానం మల్లన్నతో కలిసి తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, సందీప్, కిషన్, శంకర్, శ్రీకాంత్, గోపి, రాము, వెంకటేష్, మహేష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల చేతికి కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డ్

## మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

చివ్వెంల, మేజర్‌న్యూస్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చక ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదిశ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామంలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ బాకీకార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. 22 నెలల కాంగ్రెస్ పాలనలో గ్యారంటీల జాడే లేదు. అందుకే ఇంటింటికి కాంగ్రెస్ బాకీ కార్డులు పంచుతున్నాం అని అన్నారు. ఎన్నికల ముందు 6 గ్యారంటీలతో పాటు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, రైతు రుణమాఫీని డిసెంబర్ 9 లోపే చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అప్పట్లో గ్యారంటీ కార్డులను స్వయంగా ఇంటింటికి పంచి, ఇవి దగ్గర పెట్టుకొని రాకుంటే మాకు గుర్తు చేయండి" అని కాంగ్రెస్ నేతలే చెప్పారని తెలిపారు. 22 నెలలు గడిచినా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీ కార్డుల ఆధారంగానే ఎవరెవరికి ఎంత బాకీ ఉందో తెలిసేలా బాకీ కార్డులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రుణమాఫీ విషయంలో కూడా ప్రభుత్వం చేసిన మోసాన్ని ఆయన వివరించారు. రూ. 50 వేల కోట్లు రుణమాఫీ చేస్తామని చెప్పి, రూ. 20 వేల కోట్లు చేశామని చెబుతున్నారు. వాస్తవానికి రూ. 17 వేల కోట్ల మాత్రమే రుణమాఫీ చేసారు. రైతుబంధు కాదు, రైతు భరోసా అని చెప్పి ఒక్కోఎకరానికి రూ. 19 వేల బాకీగా ఉంది"అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జీవన్ రెడ్డి, పార్టీ ఇంచార్జి ఆకుల లవకుశ, రౌతునరసింహారావు,ధరవత్ బాబు నాయక్, గుర్రం సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పల్లెటి శైలజ నాగయ్య, రాజు, మాజీ మున్సిపల్ అన్నపూర్ణ, యాలగబోయిన శ్రీరాములు, బిఆర్ఎస్ గ్రామ యూత్ అధ్యక్షుడు గుడిసె నాగార్జున, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.



